



కని పెంచిన తలిదండ్రులు, కోరిన కట్నాలు గుమ్మరించి కల్యాణ మవడానికి కష్ట మవుతూన్న రోజుల్లో, గాలికి పుట్టి, ధూళికి పెరుగుతూన్నట్టుగా, పినతండ్రి ఇంట్లో ఎదుగుతూన్న, అన్నపూర్ణని గోపాలరావు కావాలని పెండ్లాడాడంటే గాని, ఎంత అదృష్టం అన్నారు అందరూను. ఆ అమ్మాయి అందుకూడా కొంత కారణం కావచ్చును పుట్టుకతోనే స్ఫుర ద్రూపి; ఆపైన మిసమిస లాడించే పద్దెనిమిదేళ్ల వయస్సు. పెద్దచదువు సంగీతాలు రాకపోయినా ఇంటి పనులలో ఆరితేరిన గృహిణి వనుక ఇంతకన్నా మరేం కావాలి?

గోపాలరావైనా, పిల్ల జమీందారు కాడు. ఎక్కడో దూరానున్న నవతి అన్న ఒక్క ఇది ఆవును-కాదు-అనేవారు ఎవ్వరూ లేరు. చదువు కున్నవాడు, స్వతంత్రంగా, ఏదో కొంత గడించు కుంటున్నాడు, అతని జీవిత సౌఖ్యం పరిపూర్ణం కావడానికి కావలసిందల్లా అనువైన భార్య చూడగానే అన్నపూర్ణను భార్యగా స్థిరపరచు కున్నాడు.

ఈ భారం దింపుకోవడ మెలాగ అని బెంగతో ఉన్న పినతండ్రి సుబ్బారాయుడు మారుమాటనకుండా వారంలోపునే మూడు ముళ్లూ వేయించేసి మహదానందంతో మగని దగ్గర దిగబెట్టి వచ్చేశాడు.

అన్నపూర్ణ నిజంగా అదృష్టవంతురాలే. గోపాలరావు ఆమెను తల్లిలాయి ఆదరిస్తాడు. ఆవిడ అందాన్ని, ప్రియుడుగా ఆరాధించి అనుభవిస్తాడు; భర్తగా పాలించి పోషిస్తాడు.

పసినాటినుంచీ పైకి వచ్చేదారిలేక అణిగి ఉన్న అన్నపూర్ణ ప్రేమవాహిని అదను దొరకగానే ఉరకలువేస్తూ గోపాలరావు మీదికి ప్రవహించింది. కాని ఒక్కొక్కప్పుడు, అతిప్రేమ ఆనందంకన్నా ఆరాటాన్నే వృద్ధి చేస్తుంది.

అన్నపూర్ణ ఎంత ప్రయత్నించినా, తన అదృష్టాన్ని అర్థం చేసుకోలేకపోతోంది. ఓక్కోసారి సుఖంతో ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అదంతా మాయో, మహేంద్ర జాలమో, మరునాటికి మాయమైపోగలదేమో అని బెదురు

వి. కె. మణి

తూంటుంది; రవివర్మ బొమ్మలాగున్నావని, ప్రేమతో అతడు దరిచేర్చుకున్నప్పుడల్లా ఎందుకో గుండెల్లో ఝల్లుమని తెల్లబోతుంది.

అవును. దేనికని అతనికింత ప్రేమ తనపై! తన అందానికా? తాను కురూపి కాదు గాని, త్రిలోక సుందరా? తనకన్నా చక్కనివారూ, చదువుకున్నవారూ, అతన్ని కోరేవారూ లోకంలో ఎందరుంటారో! అతని మనసు వేరెవ్వరి వైనైనా మరలితే? ఏ కారణానికైనా తన అందం తరిగితే! అమ్మయ్యో! భరించి బ్రతకడం అశక్య మనుకునేది.

ఎప్పుడూ ఆనంద ఆరాటాల మధ్య అల్లల్లాడుతూ ఉండేది అన్నపూర్ణ హృదయం. అర గంట అతను ఆలస్యంగా ఇంటికివస్తే అతన్ని చూసి మాటాడేవరకూ తల్లడిల్లిపోయేది. 'ఆయనకూ అలానే ఉంటుందా' అని తనలో తనే చర్చించుకునేది.

రెండేళ్లు రెండురోజుల్లాగ గడిచిపోయాయి. అన్నపూర్ణకి ఎనిమిదవ మాసం నిండబోతూంది. ఆనందంతో, ఆత్రంతో, కంటికి రెప్పలాగ కాస్తూ, లాలిస్తున్నాడు గోపాలరావు. ఒకనాడు ప్రొద్దుటే పాలవాడి పిలుపువిని తలుపు తెరవాలని త్వరత్వరగా మేడ దిగుతోంది. రాత్రి గోపాలరావు చేతిలోనుంచి జారిపడిన సపోటా పండు ముక్కమీద కాలుపడి, జెసిగి, క్రింది మెట్టువరకూ జరజరా జారిపడిపోయింది.

గ్రహచారం! అతనారోజు తను ఫలహారం మాని, భార్యకని అపురూపంగా కొనితెచ్చిన ఫలమే వారి సౌఖ్యనాశనకరంగా పరిణమించాలా? మేడమీద ఆ ఒక్క గదీ లేకపోయినా బాగుండునేమో

ఆదుర్దాతో ఆమెని వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్ళాడు అతను. 'శిశువును గురించిన ఆశ అసలే లేదు; తల్లి ప్రాణంకోసం శాయశక్తులా ప్రయత్నిస్తాంగాని నిశ్చయం చెప్పలేము' అన్నారు ఆ ఆస్పత్రిలో డాక్టర్లు. కాలి ఎముక తిరగబడడం, గర్భకోశం కదిలిపోవడమే కాకుండా, వెన్నెముకకు బలంగా దెబ్బ తగిలిందట.

గోపాలరావు భయార్తుడైపోయాడు. 'నా' అని ఆదరించేవాళ్ళు లేకుండా, నానా అవస్థలూ పడ్డాడు. సరి, ఎలాగైతేనేం,- మూడు రోజులు ఆలోకానికీ ఈలోకానికీ మధ్య, మరి మూడు నెలలు ఆస్పత్రిలోనూ గడిచింతర్వాత,- భార్యని తిరిగి గృహప్రవేశం చేయించాడు. అతను ఈమాటు అక్షరాలా ఎత్తుకు తీసుకువచ్చి గృహప్రవేశం చేయించాడు!

అన్నపూర్ణకు శరీరం రుగ్మతేమీ లేదు. దారుఢ్యం కూడా కలిగింది. కాని, కాళ్ళు కదలవు! వెన్నెముకకు కలిగిన దెబ్బవల్లనో, కానుపు తరువాత కలిగిన వాతంవల్లనో కాని, నడుం క్రిందిభాగమంతా మొద్దుబారిపోయింది. ఎన్ని చికిత్సలు చేసినా, రవ్వంతైనా ప్రయోజనం కలగలేదు. కాళ్ళు సన్నబడడం కూడా ప్రారంభించాయి. తన పనులన్నీ తాను చేసుకుందికైనా లేచి నడవలేదు. రాత్రి పక్కమీద చేర్చడం, ప్రొద్దుటే ఎత్తి చక్రాల కుర్చీలో కూర్చోపెట్టడం పైనాట్లు చెయ్యవలసిందే.

మేడమీది పడకగది వదలి (సౌఖ్య సౌధమని పేరు పెట్టుకున్నారు దానికి) క్రింద ఉన్న రెండు గదులలోనూ దక్షిణపు దానిలో పక్క అమర్చారు. అన్నీ ఒక్కచక్కడే గనుక, ఆ చక్రాలకుర్చీ ఉపయోగించుకుంటూ కొంతవరకూ సమర్థించుకోవచ్చును.

బయటి ఉద్యోగమే కాకుండా, ఇల్లు దిద్దే భారమూ ఇల్లాలిని సంరక్షించే బాధ్యతా కూడా గోపాలరావు పరమే అయ్యాయి. అతడు కష్టమని భావించడు కాలేదు: విసుగుతో రుసరుసలాడలేదు. బెంగతో కుములుతూన్న అన్నపూర్ణకు ఉత్సాహం కలిగేలాగ నవ్వుతూ, నవ్విస్తూ, తానింట్లో ఉన్నంతసేపూ ఆవిడకన్నీ తానే స్వయంగా చేస్తాడు. విశేషప్రేమ మహత్వమో, విధ్యుక్తధర్మ ప్రేరితమో గాని, ఆమెని ఆదరించడం జీవితలక్ష్యంగా పెట్టుకున్నాడు. కాని, పాపం, ఎంతైనా మానవమాత్రుడు!

వంటకీ, తానింట్లో లేనప్పుడుండడానికీ ఒక వంటమనిషిని ఏర్పాటు చేశాడు. ఏడు గంటలకు తను ఇంటికి వచ్చేటప్పుడు, పువ్వో, పండో, పౌడరో, ఏదో ఒక చిన్న కానుక లేనిరోజుండదు. తరుచు ఇరుగుపొరుగు స్నేహితురాళ్ళువచ్చి ఒక గంట కూర్చుని, కబుర్లుచెప్పి, కావలసినవేవైనా చేసి, వెడుతూఉంటారు. అందరిలోకి సావిత్రిమరీ

ఆప్యాయంగా చేసేది. అన్నపూర్ణకు కలిగిన లోటు, ఆవేదన, మరిపించాలని ఎన్నో విధాల ప్రయత్నించేది. అన్నపూర్ణంటే చెప్పలేనంత అభిమానం. అవును. ఇద్దరూ సమవయస్కులు. కాపురానికి వచ్చినప్పటి నుంచీ అక్కచెల్లెళ్ళ కన్నా ఎక్కువ మక్కువగా మసులుకున్నారు. వారిద్దరి మధ్య అరమరాభ్యంతరాలు లేవు. సంసార తాపత్రయంలేని తను ఆదుకుని ఆదరించాలనుకుంది.

పిల్లలకు బళ్ళో చదువు చెప్పడంచేత గాబోలు ఓరిమీ, జాలీ, మరీ హెచ్చు సావిత్రికి. సాయంత్రం ఆరుగంటల కింటికివచ్చి మరునాటికి పిల్లల పుస్తకాలు దిద్ది, (నిజంగా ఆ బ్రహ్మలిపులు చదివి, వాళ్ళ అంతరువుకు దిగి, దిద్ది, మార్కులు వేసేటందుకే ఇయ్యవచ్చును ఎంతైనానూ!) అమ్మమ్మ పెట్టిన రెండు మెతుకులూ తిని ప్రతిరోజూ రాత్రి వచ్చేది. 'రెండిళ్ళ అవతలేగా తనుండేది ఏంభయం వెళ్ళడానికి' అని ఒక్కొక్కప్పుడు ఎంతో ప్రొద్దుపోయేవరకూ కూచుని ఇష్టాగోష్ఠి సాగించేది. అతను తెచ్చిన పువ్వులు అన్నపూర్ణ తలలో నేర్పుగా అమర్చి, 'అందమంతా నీపాలే చేశాడమ్మా ఆ దేవుడు!' అని ఆ అందమంతా తనదిలాగే ఆనందపడుతూ చూసుకొని అద్దం చేతికిచ్చేంది. అన్నపూర్ణ ముఖంమీద చిరునవ్వు చిందితే తను పొంగిపోయేది. మంచంమీద పడుకోబెట్టడానికి సాయంచేసి మంచినీళ్ళచెంబు చెయ్యి తగిలి పడిపోకుండానూ, చేతికందేపాటి దూరంలోనూ పెట్టి ప్రొద్దుటి కవసరమైనవి నాలుగూ సద్ది మరీ వెళ్ళేది ఇంటికి. ఏమిటో అంత అభిమానం!

చేరుమని ఏడవవుగాని అన్నపూర్ణ ఆవేదన వర్ణనాతీతం. సిసింద్రీలా తిరిగి ఇల్లంతా చక్కబెట్టుకునే తను అజగరంలాగ కదలలేని పరిస్థితిలో ఉంది. కనుముక్కు తీరు చెడకుంటేనేం అంగవైకల్యం కలిగింది. చిన్నవయసులో తీరని కోరికలతో తపించిపోవలసి వచ్చింది. బిడ్డపాపల కనిపెంచే ముచ్చట ఈ జన్మకు లేదు!

తన అభాగ్యజీవితంలో, ప్రాణాలు నిలుపుతూ, ఆధారంగా ఉన్నది భర్త ప్రేమ ఒక్కటే కాని ఒక్కొక్కప్పుడు అదీ తన దారుణ వేదనని వెయ్యిరెట్లు ఉబికించేది. తను అతని మెడకు గుదిగొయ్యగా తయారయింది. తన మెడలో కట్టిన త్రాడు, అతని మెడకి ఉరిగా చుట్టుకుంది. చక్కనివాడు; తరుణ వయస్కుడు. తనతో జీవితం ఇలా గడపమనడం న్యాయమేనా? అలాగ కోరడానికి, తనకి హక్కేముంది? అయినా, ఎన్నాళ్ళని ఈవిధంగా తనని ప్రేమిస్తూ, శుష్కజీవితం గడపగలడు? వేరొకతెని వివాహమాడమని తను అనకపోవడం తప్పుకాదూ? మరొకతెవల్లనైనా వంశం నిలుపుకోమని, తను చెప్పడం భార్యా ధర్మం కాదూ?

ఒకనాటి ప్రస్తావన తెచ్చింది. పునర్వివాహం చేసుకొమ్మంది. మానవధర్మం ప్రకారం సౌఖ్యాలనుభవించమంది. ఆ మాటలంటూ అతనివేపు చూసింది. అతనికికూడా తెలియకుండానే ఆశాజ్యోతి, అరక్షణం మెరిసి అంతర్థానమైనదా, మెరవనే లేదా,—అన్నది మాత్రం నిర్ణయించుకోలేకపోయింది.

అటువంటి ప్రసంగ మిక ముందెన్నడూ తేవద్దని, అతను నిష్కర్షగా చెప్పాడు. తనకి ఆ ఆలోచన కూడా బాధాకరమనీ, భార్యాస్థానం మరొకతెకు ఇయ్యడం అసంభవమని అన్నాడు. అది ఆవిడ కన్యాయం చెయ్యడమనీ, అలాగ అన్యాయం చేసి తను సుఖపడలేననీ స్పష్టంగా చెప్పాడు. ఆమెకు పరిచర్యలు చెయ్యడంలోగల తన ఆనందాన్ని అటువంటి మాటలతో అలుసు చెయ్యడం భావ్యంకాదని చిన్నబుచ్చుకున్నాడు. అతనలాగ అనాలనే ఆశించింది; ఆ మాటలు విని కొంత సంతృప్తిపడింది. కాని, అతను ఆ విధంగా ఉండడం అన్యాయమనీ, అసహజమనీ, అది నిలువదనీ, నిర్లిప్తతతో తను బ్రతుకు నేర్పడమే ఇద్దరికీ సౌఖ్యదాయకమనీ, మాటిమాటికీ, బుద్ధి బోధించేది. 'అలాగ కాకూడదు' అని కాంత శాసించేది.

కొన్ని నెలలు గడిచిపోయాయి. ఒకమాటు వానలో తడిసి రావడంచేత కాబోలు, గోపాలరావుకి దగ్గు పట్టింది. రాత్రి తెల్లవార్లూ, ఇద్దరికీ నిద్రలేకుండా, తెగదగ్గేవాడు. ఏదో నాలుగు రోజులు అల్లరిపెట్టి, అదే పోతుందని అశ్రద్ధ చేశాడు. కాని, వానలు వదిలినా పట్టిన దగ్గు వదలకుండా, శీతకాలం వచ్చేసరికి స్థిరనివాసం ఏర్పరచుకున్నట్టుగా కనబడింది. డాక్టరు దగ్గరకు

వెళ్ళమని, అన్నపూర్ణ పోరుపెట్టింది. ఆ చిన్న దానికై వైద్యమేమిటనీ, - ఎవరేనా వింటే నవ్వుతారనీ,- శీతకాలంలో అందరూ దగ్గుతారనీ, కొంతకాల మైపోతేగాని అది ఎలాగా పోదనీ, - అనవసరపు ఖర్చూ, అవిధీ తను పడదలచుకో లేదనీ, ఏవేవో అడ్డంకులు చెప్పాడు. కాని, అన్నపూర్ణ ఒప్పుకో లేదు. చివరకి డాక్టరు దగ్గిరకు వెళ్ళాడు.

గోపాలరావు అభిప్రాయాలతో డాక్టరు ఏకీభవించలేదు. ఇప్పుడేమీ ప్రమాదం లేదుగాని ఆ దగ్గు అశ్రద్ధ చెయ్యకూడదన్నాడు. ఏవేవో దానికి కారణాలూ, మందులూ చెప్పి అన్నిటికన్నా ముఖ్యమైనది, బాగా గాలి వచ్చేలాటి, విశాలమైన గదిలో నిద్రించాలన్నాడు. ఆ చిన్న గదిలో ఇద్దరు నిద్రించడం ఆరోగ్యం కాదన్నాడు. ఎలాగ? అన్నపూర్ణ పైకి రాలేదే అంటే, - ఆ మాట వాస్తవమే గాని, ఎలాగో సరిపెట్టుకుని తీరాలన్నాడు

ఇంటికి రాగానే, 'చూశావా? ఇందుకే నాకు డాక్టరు దగ్గరకి వెళ్ళడమంటే అసహ్యం, లేనిపోనివి అన్నీ అసందర్భంగా చెపుతారు' అంటూ డాక్టరన్నదంతా చెప్పి తను మాత్రం అదేమీ చెయ్యదలచుకో లేదని అన్నాడు. రాత్రంతా ఒంటరిగా అన్నపూర్ణని ఎలాగ వదిలిపెయ్యడం? అది అసంగతం, అని వాదించాడు.

అన్నపూర్ణ అతని మాటలు ఒప్పుకో లేదు. డాక్టరు చెప్పినట్టు చెయ్యాలని పట్టుబట్టింది. పోనీ, తన మనఃశాంతి కోసమైనా వినరాదా అని కళ్ళనీళ్ళతో బ్రతిమాలింది. ఇంకేమీ ఎదురు చెప్పలేక పోయాడు. మేడమీది గదిలోకి తన పక్క మార్చుకున్నాడు.

* * *

సావిత్రి చాలా సరదా అయినది. ప్రపంచమంతా ఒక పెద్ద ఆటస్థలమనీ, ఎవరికీ హాని చెయ్యకుండా, ఒకరిని కొట్టకుండా, ఆనందం పొల్లుకుంటూ ఆడుకోవాలని ప్రయత్నిస్తుంది. స్నేహంకట్టు ప్రాణమిస్తుంది. ఉన్నంతసేపూ, ఏవో తమాషా కథలూ, కబుర్లూ చెపుతూ కులాసాగా కాలక్షేపం చేయిస్తుంది. సావిత్రి వెళ్ళిం తర్వాతకూడా, ఆ చలాకీ మాటలు తిరిగి చెప్పుకుని నవ్వుకునేవారు, అన్నపూర్ణా గోపాలరావూనూ

అంతకంతకి సావిత్రి, గోపాలరావుకి కూడా కుటుంబంలో మనిషిలాగ అతిచనువు అయిపోయింది మొగమాటం లేకుండా ముచ్చట్లాడుకునేవారు. పదిగంటల వరకూ ఉండి, అన్నపూర్ణని ప్రక్కమీద చేర్చి 'ఇంక వెళ్ళవస్తాను. నాకేం సాయ మక్కరలేదండీ, ఇక్కడేగదూ? కనిపారనా? దారి తప్పిపోతానా?' అంటూ, లేచి ఇంటికి వెళ్ళి పోయేది. భార్య ఆదేశ ప్రకారం గోపాలరావు గుమ్మం వరకూ వెళ్ళి, రెండు మాటలాడి వీధితలుపు వేసుకునివచ్చేవాడు.

ఆ తలుపు గడియ పెద్ద కిరకిర చప్పుడుతో పడుతుంది. అక్కడి నడవలోనించే మేడమీదకి మెట్లు అన్నపూర్ణ పడుండే గదికీ నడవకీమధ్య మరొక గది ఉంది. ఒకనాటిరాత్రి సావిత్రిని సాగనంపి, మెల్లిగా అతను గదిలోనికి వచ్చాడు. అన్నపూర్ణ త్రుళ్ళిపడింది. 'అబ్బా, హడలగొట్టేశారండీ సావిత్రి వెళ్ళిందనీ, మీరు వస్తున్నారనీ అనుకో లేదు. తలుపు వద్ద చప్పుడు నాకు వినపడనే లేదు.'

'లేదు ఇవాళ తలుపు చప్పుడు కాలేదు. సాయంత్రం దానిలో కాస్త కొబ్బరి నూనె పోశాను వెధవ కిరకిర. చిరాకెత్తిస్తోంది. అది లేకపోతే. ఎంతో సుఖంగా ఉంటుంది కాదూ ప్రాణానికి?'

'అవును. చాలా బాగుంది - ఊరంత ధ్వని చేసేది. అందులో కాస్త కొబ్బరినూనె పొయ్యాలని ఎందుకో తోచనే లేదు మనకి!' అని ఏదో అసంతుష్టితో అంది.

మరొకరాత్రి సావిత్రిని పంపించేక గోపాలరావు మామూలుకన్నా ఆలస్యంగా గదిలోకి వచ్చాడు. మేడమీదకి వెళ్ళి వచ్చాడుట. అన్నపూర్ణకి అసందర్భంగా కనపడింది ఆపని ఎందుకు వెళ్ళాడు? ఇంతవరకెన్నడూ తిన్నగా తనగదిలోకి రావడమే గాని, అలాగ వెళ్ళలేదే 'నన్ను మరచిపోయి వెళ్ళి పడుకున్నారనుకున్నాను' అంది వేళాకోళం లాగ.

'వానజల్లు వస్తోందని పైకి వెళ్ళి కిటికీ తలుపులు వేసి వచ్చాను' అన్నాడు.

నిజమే. అందులో అసందర్భ మేముంది? ఎవ్వరైనా చేసేదేకాని ఏమో — మనసుకు మాత్రం సంతృప్తి కలుగలేదు. వానజల్లు ఉంటే సావిత్రితో మాట్లాడుతూ, అంతసేపు గుమ్మంలో ఎందుకు నిలవాలి? అంతవరకూ లేని తొందర, వెంటనే తరుముకు వచ్చిందా? తన దగ్గిరికివచ్చి చెప్పి వెళ్ళవచ్చునే! ఏమంత అవసరం కలిగింది, ముందుగానే మేడ మీదకి వెళ్ళడానికి? క్రాపు చెదిరిందా? లేదా కాటుక చారికలేమైనా అంటుకున్నాయేమోనని అద్దంలో చూసుకుందికా? అణిచి ఉంచిన, అసూయా అనుమానాలు తొంగిచూస్తూ వేధించడమారంభించాయి. ఈ మధ్య గుమ్మం దగ్గిర ఎంతో సేపుంటున్నారు. ముందుగా తలుపుతీసి, మెట్లమీద నిలచి మాటాడుతారో, లేక మాటలన్నీ అన్నీ అయ్యాకనే తలుపు తీస్తారో? ఎలా తెలుస్తుంది? నూనెపోసిన తర్వాత, తలుపు వేసీ తీసిన సంగతే తెలియడం లేదు. అసలు నూనె ఎందుకు పొయ్యాలి? ఇన్నాళ్లు నించీ లేని చిరాకిప్పుడెందుకు కలిగిందో? అయినా ఏమంత చప్పుడు చేసేదని? ఇలాగే ఆలోచనతో రెండు దాటేవరకూ నిద్ర పట్టకుండా బాధ పడింది.

ఇంకొక రెండు రోజుల తర్వాత, సావిత్రిని సాగనంపి గోపాలరావు రావడం బాగా ఆలస్యమయింది. సావిత్రి వెళ్ళిపోయిందనీ, అతను మేడ మీదికి వెళ్లి ఉంటాడనీ అనుకుంది మొదట. కాని పదినిముషాల తర్వాత, 'వెళ్లివస్తాను' అన్న సావిత్రి మాటా, అతను గట్టిగా గడియ వేసిన ధ్వనీ వినబడ్డాయి. నూనె వేశాక తలుపు వేసిన శబ్దమవడం అదే మొదటిసారి. ఎందుకయిందని రాగానే అడగాలనుకుంది. కాని, మరి పది నిముషాల వరకూ అతను రాలేదు. అతను లోపల అడుగు పెట్టగానే 'వాన వస్తోందా?' అని అడిగింది.

'అబ్బే. లేదే! ఎందుకలా అనుకున్నావు?' అంతలోనే జ్ఞాపకం వచ్చి, నవ్వుతూ అన్నాడు: 'ఓహో, మేడమీదకి వెళ్లి వచ్చాననా? ఎందుకు వెళ్లానో చెప్పుకో చూద్దాం... మరేం లేదు. సాయంత్రం పక్కదులిపించి వేయించుకోవడం మరిచి పోయాను. అది జ్ఞాపకం వచ్చి, వెళ్లి వేసుకుని వచ్చాను.'

'పాపం అవిధేగాని, ఆనందంలేని జీవితమై పోయింది మీది. చూసి సంరక్షణ చేసేవాళ్లు లేరు... పోనీ-పెళ్లి చేసుకోరాదటండీ?'

'ఇదిగో! ఆమాట మళ్లీ అన్నావంటే తప్పకుండా చేసేసుకుంటాను. మా అన్నయ్య మనుమరాలు మూడేళ్ల పిల్ల సిద్ధంగా ఉంది కూడాను. లేదా, మా పెద్దనాన్న దగ్గిరనుంచి మా వెంకమ్మ బామ్మనేనా చేరదీసుకు వచ్చేస్తాను ఎటొచ్చీ ఆవిడైతే నడిచిరాలేదు' అని పరిహాసంగా అంటూ ప్రేమతో చెక్కిలి నిమిరాడు.

అన్నపూర్ణకి ఎందుకో కలుక్కుమంది గుండెల్లో. 'తలుపు తిన్నగా పడడం లేదా?'

'తలుపా?'

'ఆ! వీధితలుపు ఇందాకా మీరు వెయ్యడం బాగా వినబడింది.'

'అలాగా? అవును ఎందుకో బిట్టుగా ఉంది. కొట్టి వేశాను, మళ్ళీ కాస్త నూనె వెయ్యాలనుకుంటాను.'

మరి పది నిముషాలేదో మాట్లాడి దీపం తగ్గించి అతను పైకి వెళ్ళిపోయాడు. ఎంత ప్రయత్నించినా, అన్నపూర్ణకి నిద్రరాలేదు. కళ్లు మూస్తుంది. కాని, బాధాకరమైన తలపులు భయంకరంగా ఎదుట నిలిచి బెదిరిస్తున్నాయి.

సావిత్రి మేడమీద గదిలో ఉందేమో? సందేహమెందుకు? నిశ్చయంగా ఉండి ఉంటుంది అనుకుంది. జరిగిన సంఘటనలన్నీ తిరగతోడుకుంది. దేనికది విడిగా తీస్తే అన్నీ నిరపాయమైనవే. కాని, అన్నీ కలిపి అల్లితే? సావిత్రి ప్రతిరోజూ వచ్చి, అంతసేపక్కడ కాలం గడపడం దేనికి? స్నేహం చేతనా? కావచ్చును. కాని తక్కిన ఇరుగుపొరుగు స్నేహితులంతా రోజూ వచ్చి గంటల తరబడి కూర్చుంటున్నారా? మహా అయితే వారానికి రెండుసార్లు వచ్చి ఒకగంట ఉండి వెడతారేమో! సావిత్రికి గోపాలరావు దగ్గర పరపురుషుడు అన్న జంకుగొంకులే లేవు. అయితే అలవాటుగా రావడంచేతనేమో కాని అదెందుకంతగా రావాలి? అస్తమానం దేనికో దానికి ఇద్దరూ కలిసి నవ్వుతూనే ఉంటారు. మధ్యమధ్య అరమరికలులేని చూపులు!

రోజూ గుమ్మం దగ్గిర ఏం మాట్లాడుతారో? ఎంతసేపు నిలబడుతారో! ఇంకేముందు— ముద్దాడుతాడా? ఆమాట తోచేసరికి తేలు కుట్టినట్టయింది. 'అమ్మా!' అని మూలుగుతూ అటూఇటూ పొర్లింది. ఆలోచనలు రాకుండా ఆపుకో లేకపోయింది.

మొదట ఆ తలుపులో నూనె ఎందుకు వేశారో? అక్కడనించి మేడమీదకు వెంటనే ఎందుకు వెళ్ళేవాడు? ఏవేవో కారణాలు చెప్పితే మాత్రం అవి నమ్మడమెలాగ? మరి ఈరాత్రి 'వెళ్ళివస్తా'నని సావిత్రి గట్టిగా చెప్పింది. అతను కావాలని చప్పుడయ్యేలాగ తలుపువేశాడు. దేనికి? సావిత్రి వెళ్ళిపోయిందనీ, తాను తలుపు వేసుకుని వచ్చాననీ, తనకు తెలియాలనా? సావిత్రి వెళ్ళిపోయిందని తను అనుకోవాలని. అంటే-నిజంగా వెళ్ళలేదు! ఇంటికి వెళ్ళలేదు. మెల్లిగా మేడమీదికి వెళ్ళిఉంటుంది. ఇప్పుడు మేడమీద సావిత్రి అతనితో - అతనికౌగిట! కాలిన గునపం గుండెల్లో గ్రుచ్చుకున్నట్టుగా విలవిల లాడిపోయింది అన్నపూర్ణ సహించుకుందామని కాయశక్తులా తంటాలుపడింది. కాని పుట్టలో పాముల్లాగ బుసకొడుతూ, ఆలోచనలు- తాను క్రొత్త పెళ్ళికూతురుగా అతని దగ్గరకు వచ్చిననాటినుంచీ జరిగిన సన్నివేశా లెన్నెన్నో ఒక్కుమ్మడిగా తలపునకువచ్చి తబ్బిబ్బు చెయ్యసాగాయి. తమ తొలివలపురోజులు: పరిపూర్ణమైన ప్రేమానుభూతులు. తన సిగ్గు; అతని కాంక్ష; ఈనాడు ఆ వేడుకలన్నీ సావిత్రి పాలై పోయాయా! సందేహముందా? లేదు. నిశ్చయమే! దుర్భరదుఃఖం కలిగిస్తూ, ఆ దృశ్యమంతా కళ్ళకు కట్టినట్టుగా కనపడసాగింది.

ఈపాటికి సావిత్రి తనలాగే అతని కౌగిట్లో కరిగిపోతూ అర మోడ్పు కన్నులతో! కంటికి కనపడని మంటలలో నిలువునా దహించుకుపోయింది అన్నపూర్ణ. దుస్సహమైన వేదనతో లేచికూర్చుంది. ఇది భరించడం అశక్యమంది. కాని, ఏమిటి చెయ్యడం?

ఎన్నో వాదోపవాదాలు వేధిస్తూ, వేగిర పెడుతూ, తల్లో గిరగిర తిరిగిపోసాగేయి. తన ఊహాలన్నీ నిజమా? నిజమే. అయితే మాత్రం ఏం? తనే అతన్ని వివాహమాడమని చెప్పింది కాదూ? అంతకన్నా దుస్సహమా ఇది? మరొకతె బదులు సావిత్రి. అంతేకదా? తను అతన్ని పెళ్ళిచేసుకొమ్మని నోటితో అన్నదేకాని, మనసారా కోరిందా? అతను 'ఊహు' అనాలని ఆశిస్తూనేఉంది. సరేకాని,- సావిత్రితో, మరొకతెతో, లేకపోయినాకూడా తను అనుభవించ గలిగిన దేమీలేదే. తనియ్యలేని సౌఖ్యమింకెవ్వరి వల్లనైనా అతను పొందితే తప్పా? అటువంటి అనవసరపు అసూయతో తను బాధపడడం నీచం కాదూ? కావచ్చును. కాని, అది అణుచుకోవడం సాధ్యం కావడంలేదు. ఏం ఎందుకు సాధ్యంకాదు? సుబ్బమ్మగారు వండి వడ్డిస్తే తను సహించడం లేదూ? అబ్బే. అలాగ ఇది సరిపెట్టుకోవడం ఎలాగా? ఇంతకీ సావిత్రి అతనితో ఉందా? ఏమైనాసరే నిశ్చయంగా తెలుసుకు తీరాలని సంకల్పించుకుంది.

ఎలాగ? పైకి వెళ్ళి తను స్వయంగా చూడాలి; పాకుతూనేనా తను పైకి వెళ్ళి తీరాలి. కష్టంగాని, తను మెల్లిగా కదలగలదు. ఎలాగో అలాగ వెళ్ళి సందేహనివారణ చేసుకోక పోతే తను ఇంక బ్రతకలేదు.

కప్పుకున్న బట్టలన్నీ పక్కకి తోసి, మంచం అంచువరకూ జరిగింది. మంచం ఎక్కువ ఎత్తైనదికాదు. చేతులమీద ఆనుకుని మెల్లిగా నేల మీదకి జారింది. కొంచెం కొంచెంగా పాకుతూ కష్టంమీద గుమ్మాలుదాటి మెట్లదగ్గిరకొచ్చింది. అలసటతో, ఆలోచనలో ఒక్క క్షణం అలాగే ఆగింది. ఇంతలో చేతికేదో తగిలింది. తీసి చూస్తే జడ పిన్ను! సావిత్రిదా?

క్షణం క్రిందటి అలసటంతా అంతర్ధానమై పోయి, అమానుష శక్తి ఆవహించింది. బరువుగా దిగలాగుతూన్న కాళ్ళని ఈడ్చుకుంటూ, చేతుల బలంమీద మెట్టు మెట్టూ ప్రాకుతూ ఎక్కి పైకి చేరుకుంది. బలహీనంతో, బాధతో ముచ్చెమటలు పోసిపోవటం తట తట కొట్టుకుంటూన్న హృదయాన్ని కుదుటబర్చుకుంటూ కొంతసేపు చెవి ఒగ్గివింది. అంతటా నిశ్శబ్దం. తడుముకుంటూ, ఏ పాటి ధ్వనీ కాకుండా, కొంచెం కొంచెంగా ముందుకు జరుగుతూ, పడక గది గుమ్మం దగ్గిరకు చేరుకుంది. తమ పడక గది!

ఒళ్ళంతా కంపించి పోతోంది, ఉచ్ఛ్వాస

నిశ్వాసాలు ఆయాసంతో వస్తున్నాయి. లోపల సావిత్రే కనక ఉంటే - చూసి తనేమి చేస్తుంది? ఏమో ఏమిచేస్తుందో! ఆడంతా ఇప్పుడాలోచించలేదు. ముందు నిజస్థితి తెలుసుకోవడమే తనకు కావలసింది ఈ సందిగ్ధావస్థలో తీవ్ర యాతన తానింక పడలేదు.

తలుపు తెరవాలని మొండితెగువతో, ఒక్క ఊపున ముందుకు దూకింది. దభీమని పెద్ద శబ్దంతో గుమ్మం పక్కనున్న గుండ్రబల్ల తిరగబడింది. ఆ చిన్న వసారాలో, ఆ బల్లమీద పలహారాలు పెట్టుకుని, తామెన్నిసార్లు తిన్నారో. అది ఇంకా అలాగే అక్కడ ఉందా? తృటిలో, తటిల్లతలలాగ మెరసిపోయాయి ఎన్నో జ్ఞాపకాలు. గాఢ నిద్రలోనుంచి ఉలిక్కిపడి లేచాడు గోపాలరావు.

'ఎవరది? ఎవరక్కడ?' అని కేక వేశాడు.

'నేను'

'ఎవరు? పూర్ణా! నిజంగా నువ్వేనా?' అని అంటూ తలుపు తెరువమరి బయటికి వచ్చాడు. గుమ్మం దగ్గిర అన్నపూర్ణ - అలసటతో ఆదుర్దాతో కూర్చుందుకు కూడా ఓపిక లేని స్థితిలో పడివుంది.

'పూర్ణా, ఎలా వచ్చావు పైకి? ఒంట్లో బాగా లేదా? అయ్యో నువ్వు పిల్చావు గాబోలు నాకు వినపడలేదు. ఎంత మొద్దు నిద్ర పోయానో' అంటూ, ఆదరంతో లేవదీసి దగ్గరగా చేర్చుకున్నాడు.

అన్నపూర్ణకి దుఃఖంతో కళ్ళు నీళ్ళు నిండిపోతున్నాయి; బాధాతిరేకంతో కంఠం రుద్ధమైపోతోంది. జాలిగా అతనివైపు చూస్తూ, గద్గద స్వరంతో వెక్కుతూ అంది, 'మీతో సావిత్రి ఉంది.'

'సావిత్రా!' అతి ఆశ్చర్యంగా అన్నాడు. 'సావిత్రా? సావిత్రి ఇక్కడికెలాగ వస్తుంది? పూర్ణా, నీకెందుకలాంటి భ్రమ కలిగింది? పిచ్చి పిల్లా! ఏదో పీడ కలకన్నావు గాబోలు పాపం. ఎంత బెదిరిపోయావో!' చెక్కిటి స్వేద బిందువులను ప్రేమతో తుడిచాడు.

'లేదు. కల కాదు. మీతో సావిత్రి ఉంది.'

'కాని, పూర్ణా! నాతో ఎలా ఉంటుంది? ఎందుకుంటుంది?'

'మీ ఇద్దరికీ, - సంబంధం. - ఒకరిమీద ఒకరికి ప్రేమ—'

'సావిత్రి మీద నాకు ప్రేమా...పూర్ణా, ఎంతో తెలివైన దానివనుకున్నాను. ఇంతేనా? మా ఇద్దరికీ కూడా నీమీదనే విపరీతమైన ప్రేమ అని, ఇన్నాళ్ళయినా నీకు తెలియలేదూ? నీ కసలు అటువంటి ఆలోచన ఎందుకు కలిగింది?'

'ఏమో తెలియదు. కాని అలా అనిపించింది'

'లేదు, పూర్ణా నువ్వు భయపడవలసిందేమీ లేదు. నమ్ము నా ప్రేమంతా నీదే. అయ్యయ్యో చలివేసేనేమో ఎలా గజగజ లాడిపోతున్నావో ఇంకేం పిచ్చి ఊహల్ని కరిమేసి గదిలోకివచ్చి నిద్రపో'

'ఆ గదిలోనా? మీ ప్రక్కనా' తన చెవులను తనే నమ్మలేకుండా, ఆశ్చర్యంతో అంది.

'అవును. ఈ గదిలోనే. నా పక్కనే. ఏం? కూడదా? దేనికంత వింత?, పసిపాపనిలా ఎత్తి తీసుకునిపోయి తన ప్రక్కమీద పడుకోబెట్టాడు. తలుపు మూల ఉన్న చాప చుట్ట జారి పడిపోకుండా సర్దిపెట్టి, తనువచ్చి ఆమె ప్రక్కని పడుకుని ఇద్దరికీ కలిపి శాలువా కప్పాడు. చెదరిన ముంగురులు సవరిస్తూ, ఆదరంగా అడిగాడు, 'సందేహమంతా పోయి సుఖంగా ఉందా?'

'నిజంగా, నిజంగా నామీద ప్రేమఉందా?'

'లేకపోతే, దేనికింత తాపత్రయ పడుతున్నాను? నిన్ను సంతోషపెట్టాలని, చేతనైనంత వరకూ ప్రయత్నిస్తున్నానని నీకుమాత్రం తెలియదూ?'

'సావిత్రి గురించి మీకేం బాధలేదా?'

'నాకేమీ బాధలేదు. రవ్వంత కూడా లేదు.'

'రాత్రి మీరు పైకి వచ్చినప్పటి నుంచీ- నిద్ర పట్టనేలేదు. ఏవో అనుమానాలు, ఏవేవో ఆలోచనలు అబ్బ. యమయాతన పడ్డాను.'

'పాపం, వెర్రిపిల్లా ఎంత బాధపడ్డావో. ఇంతకీ మూలం నీ అతితెలివి, ఊహాశక్తి. అయినా, ఇన్నాళ్లూ రాత్రులు ఒంటరిగా వదలడం నాదే తప్పు. రేపటినించి నేనూ క్రిందనే పక్క వేసుకుంటాను.

'అబ్బెబ్బే. అలా వద్దండీ, నేను ఒక్కర్తినీ ఉన్నా నాకేం భయంలేదు. మీ ప్రేమ నాదయితే మీరెక్కడున్నా నాకు బెంగలేదు.'

'అలాగ నువ్వు సంతృప్తిచెందితే నా కింకేం కావాలి?'

అన్నపూర్ణ చేతులు అతన్ని గట్టిగా చుట్టుకున్నాయి. కొంతసేపటికి అలసట, ఆనందంతో కలిగిన సంపూర్ణ విశ్రాంతితో ఆమెకి గాఢంగా నిద్రపట్టింది. అతను కూడా నిశ్చలంగా పడుకునే ఉన్నాడు. నిద్రమాత్రం లేదు భయంతో కొట్టుకుంటూన్న గుండెలతో, ఆందోళనతో ఊపిరి బిగబట్టి ప్రార్థిస్తున్నాడు.

'చాప చప్పుడు కాకుండా తీసి, ఓరగా తలుపువేసి, క్రిందికి వెళ్ళగలదా సావిత్రి? అది సాధ్యం కావాలి! అన్నపూర్ణకి వ్యథ కలుగకుండా ఉండాలి!'

సావిత్రిదీ అదే ఆందోళన; అదే ప్రార్థన.

# ★ క్షణంతోపగం ★

"శారద"

ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం పోట్లాడుకుని ఫుల్‌స్టాప్ అయిపోయాయి. కావ్యనిర్మాణంలో కవి కర్తని మర్చిపోయినాడు. చెప్పిన పని చేసే వాడికన్నా, చెయ్యకుండా చెప్పేవాడే అనాథ మానవులకి అధినేతా, నోరులేని పత్రికలకి ఎడిటరూ అవుతున్నాడు. వికాసం హఠాత్తుగా ప్రశ్నిస్తాడు: 'పెద్దముల్లూ చిన్నముల్లూ రోజులో ఎన్నిసార్లు కలుసుకుంటాయి?' అని. దరిద్రుడు. దేశంలో ఇంకేం ప్రశ్నలు లేనట్టే! ఉద్యోగం దొరికినవాడు దొరకనివాడిని చూసి ఈర్ష్య పడటానికి కారణం ఏమిటో చెప్పటం సాధ్యం కాకుండావుంది. జీతాల పెంపకంలో హెచ్చు తగ్గుల విషయమై వేసిన కమిటీ లంచాల విషయం తేల్చటం సముచితంగావుంది. వాడొక నాన్ గెజెటెడ్ ఆఫీసరు. వాళ్ళ ఉన్నబ్బాయి ఆఫీసర్ గారి హోదాకి భంగంరాని విధంగా గౌరవప్రదంగా వురెట్టుకుని చచ్చాడు.

పక్కింటాయన అర్ధరాత్రి రేడియో పెట్టుకుని నా నిద్రకి జోలపాడుతూంటే వాణ్ణీ వాడి రేడియోనీ ఇంట్లో ఎవరూ లేకుండా చూసి పాతేశాను. మనస్తత్వ సిద్ధాంతి వచ్చి, వాణ్ణీ వాడి రేడియోనీ బతికించాడు. నేనూ నా దీపం ఇల్లు మార్చుకున్నాం. ఈ ఇంటికి కప్పులేదు. గోడలూ లేవు. హాయిగావుంది ప్రాణానికి. సరిహద్దులులేని దేశానికి యుద్ధాలుండవ్. వాళ్ళబ్బాయికి బారసాలచేసి పేరుపెట్టారు. పేరెందుకన్నాడు అభ్యుదయకామి. వాళ్ళపిల్లకి అన్నీ రాజకీయ నామాలే పెట్టాడాయన. విప్లవం; దేశభక్తుడు; త్యాగం...ఇట్లా.ఏం బావుండలా? ఇకముందు పుట్టబొయ్యే అమ్మాయిలకి కొన్ని పేర్లు సూచించాడు కూడాను. అశోకచక్రం; రాష్ట్రభాషావర్ధని; అధికోత్పత్తి సంజీవి. వనమహోత్సవి, అని ఇంకా చాలా చెప్పేడు గాని జ్ఞాపకం రావటం లేదు. విలాసరావు 'కొత్త యుగానికి కొత్తపేర్లు' అని ఒక సుప్రసిద్ధ దినపత్రిక ఆదివారపు సాహిత్యానుబంధంలో వ్యాసం వ్రాశాడు.

'మీ అమ్మాయిల్ని మీ జీవిత సాన్నిహిత్యంలోకి తెచ్చే పేర్లతో పిలిచి ముందడుగు వెయ్యండి. ప్రతీదానికి 'పర్పస్' ఉండాలని రాజకీయ, సాహిత్యవేత్తలు గొంతుకలు తడిలేకుండా అరుస్తున్నారు. వాళ్ళని కనికరించి మీ అమ్మాయిల పేర్లని సార్థకం చెయ్యండి. ఇదిగో ఉదాహరణ: సంపోర్ణిణి; విడాకులు; ముందడుగు, ఖద్దరునూలు; సుఖజీవితం; ఫుడ్ రేషన్; కుషన్ కుర్చీ; నిర్మాణ కార్యక్రమి; విద్యావయోజని; బహుభార్యా నిషేధని; లాంటివి. ఆపైన మీరూ ఆలోచించి మంచి పేర్లు పెట్టుకోవచ్చు.'

విలాసరావు తెలివికి మెచ్చి స్వతంత్ర భారత ప్రభుత్వం ఏదైనా సబ్సిడీ ఇవ్వచ్చని వ్యాసంకింద ఎడిటర్ ఫుట్‌నోట్ పెట్టాడు. ఈ సూచనని నేను అమల్లో పెట్టేశాను. నా పుట్టగల మొదటి అమ్మాయి పేరు దరిద్రవర్ధని అనో, దరిద్ర నిరోధిని అనో పెట్టగలను. కాని నా భార్యమాత్రం మా అత్తగారి నామం సార్థకం చెయ్యాలని మొండికేస్తోంది. దానికి అభ్యుదయం; పర్పస్, లిటరేచర్-లాంటి పదాలు అర్థమై చావటంలేదు.